RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 294

బుధవారం
అక్టోబర్ 29, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



'హైడ్రా' చేతుల్లో బమ్మృక్నుద్దౌలా చెరువు పునరుద్ధరణ

3లో..

## అవసరమైతే పోక్సో కేసు నమోదు చేయండి..!

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లాలోని ఓ పాఠశాలలో యాకుబ్ భాషా అనే అటెండర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గత 5 రోజుల నుండే లోతైన విచారణ జరిపి నివేదిక తెప్పించుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పోక్సో కేసు కావడంతో విషయం బయటకు వస్తే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటకు రానియ్యలేదన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో ఈరోజు హెచ్‌ఎం ను కూడా సస్పెండ్ చేశారన్నారు.

మిగతా 3వ పేజీలో..

## ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డి నియామకం

**వేద న్యూస్, హనుమకొండ :**



వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసుపత్రి పాలనా వ్యవహారాలలో మరింత సమర్థతను, పర్యవేక్షణను తీసుకురావడానికి ఈ నియామకం జరిగినట్లు తెలుస్తోంది. వరంగల్ మరియు పరిసర జిల్లాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎంజీఎం ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తున్నందున, కొత్త సూపరింటెండెంట్ సారథ్యంలో ఆసుపత్రి సేవలు మరింత మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డి తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వులలో పేర్కొంది.

## శంకరమఠంలో సీఎం ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గణపతి, శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి మరియు ఆదిశంకరాచార్యుల ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, శంకరమఠంలో 'ధర్మ విజయ యాత్ర' లో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి వారిని ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా కలిశారు.

## ప్రణాళికలను సిద్ధం చేయండి

- డ్యామ్స్ సేఫ్టీపై ముఖ్యమంత్రి రివ్యూ
- రాష్ట్రంలోని ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనం
- బ్యారేజీల మరమ్మతులకు ప్రణాళికలు, బాధ్యత ఏజెన్సీలదే: సీఎం రేవంత్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా సమగ్ర విశ్లేషణలు జరగాలని సీఎం స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ 'కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్'కు సంబంధించి రాసిన లేఖపై ముఖ్యమంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో మంగళవారం సమీక్షించారు. నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిపైనా సమగ్రమైన అధ్యయనం పూర్తి చేసి, తగిన నివేదికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించిన ముఖ్యమంత్రి, అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల వారీగా సమగ్ర వివరాలతో విశ్లేషణలు జరగాలని, రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపైనా స్టేటస్ రిపోర్ట్‌లను తయారు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల ప్రస్తుత పరిస్థితిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. కూలిపోయిన లేదా దెబ్బతిన్న బ్యారేజీల మరమ్మ తు లకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని, మరమ్మ తు లకు సంబంధించిన బాధ్యత ఆయా నిర్మాణ సంస్థలే (సంబంధిత ఏజెన్సీలే) వహించేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టుల వారీగా రూపొందించే పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా నిర్ణయించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై కూడా ముఖ్యమంత్రి సమీక్షలో చర్చించారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా ప్రాజెక్టుకు అవసరమైన సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ప్రణాళికలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించే విధంగా ఉండాలని చెప్పారు. ఇందుకు ఇప్పటికే ఉన్న పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లడానికి వీలుగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. అలాగే, సుందిళ్లను మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



## కన్నబిడ్డ విక్రయ ఘటనపై మంత్రి సీతక్క సీరియస్



- నివేదిక ఇవ్వాలని ఆదేశం

**వేద న్యూస్ , హైదరాబాద్ :**

నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న కన్నబి డ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల అమ్మకాలు, అక్రమ దత్తతలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన మంత్రి సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజాతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. శిశువును తక్షణమే సంరక్షణలోకి తీసుకోవాలని, ఆ తల్లి పరిస్థితిని తెలుసుకోవాలని అధికారులను సూచించారు. ఈ ఘటనకు సంబంధించి ఏమైనా అధికారుల నిర్లక్ష్యం ఉంటే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "తల్లి -బిడ్డల రక్షణ మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. పేదరికం లేదా అజ్ఞానం కారణంగా ఇలాంటి దారుణాలు జరగడం మనసుకు బాధ కలిగిస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తప్పవు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ మరియు బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. అక్రమ పిల్లల విక్రయాలు, అక్రమ దత్తత వంటి అన్యాయాలను నిరోధించడానికి సమాజం కూడా ముందుకు రావాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

## రాజ్ భవన్‌లో ప్రముఖులతో గవర్నర్ భేటీ

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మంగళవారం రాజ్ భవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాలలో ముఖ్యంగా, యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ-2025 కోశాధికారి ప్రవీణ్ థామస్ జాన్ మరియు ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిశారు. అనంతరం, 'స్విచ్‌కో సస్టైనబిలిటీ' సంస్థ వ్యవస్థాపక సీఈఓ అయిన అక్షయ్ దేశ్‌పాండే మరియు ఇతరులు గవర్నర్‌తో సమావేశమై, సస్టైనబిలిటీ (సుస్థిరత) అంశాలపై చర్చించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉపాధ్యక్షురాలు మరియు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయిన ఎ. సుగుణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి వివిధ రాజకీయ మరియు సామాజిక అంశాలపై చర్చించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోజువారీ కార్యకలాపాలలో భాగంగా వివిధ వర్గాల ప్రముఖులతో భేటీ అయ్యి, వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు.

## ఉదండాపూర్ నిర్వాసితులకు అండగా ఉంటాం

**వేద న్యూస్, హైదరాబాద్ :**



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన ఉదండాపూర్ రిజర్వాయర్ కోసం భూములిచ్చిన నిర్వాసిత రైతులతో కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె వారి కష్టాలు, ఆందోళనలను ఓపికగా విని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ బృహత్తర ప్రాజెక్టు పనులు గతంలోనే శరవేగంగా జరిగాయని, ఇప్పటికే 80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని కవిత వెల్లడిరచారు. మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి, ఈ ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితుల హక్కులను కవిత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి తనను తాను 'పాలమూరు పులి'గా చెప్పుకుంటున్నారని, కానీ క్షేత్రస్థాయిలో ఆయన

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్

బుధవారం అక్టోబర్ 29, 2025

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభకు మంత్రి అభినందనలు

**వేద న్యూస్, హైదరాబాద్:**



నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి గౌరవాన్ని తెస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన అండర్-13 జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన సహస్ర (7వ తరగతి), అలాగే డబుల్స్ విభాగంలో బంగారు పతకం మరియు సీబీఎస్సీ జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ (క్లస్టర్స్)లో కాంస్య పతకం గెలుచుకున్న అన్య (7వ తరగతి) ఈరోజు ఉదయం డీపీఎస్ సీఈఓ మల్క యశ్వసీ, బ్యాడ్మింటన్ కోచ్ హర్షతో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు యువ క్రీడాకారిణుల ప్రతిభను ప్రశంసిస్తూ, తెలంగాణ రాష్ట్రం నుంచి ఇలాంటి ప్రతిభావంతులు వెలుగులోకి రావడం ఎంతో ఆనందకరమన్నారు. క్రీడా రంగంలో మరింత రాణించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని ముఖ్యంగా సీఈఓ మల్క యశ్వసీని మంత్రి ప్రశంసించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినుల విజయాలు పాఠశాలకు రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ (బ్యాట్ అడ్వైజర్) కూడా పాల్గొన్నారు.

# నూర్జహాన్ పల్లి లో పశు వైద్య శిబిరం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని పశు సంపదలో అగ్రస్థానం నిలిచిన నూర్జహాన్ పల్లి గ్రామంలో పశువులకు స్థానిక పశు వైద్యాధికారి సునిల్ , ప్రజ్వాల్ సంస్థ సంయుక్తంగా గ్రామంలోని నూట యాభై తెల్లజాతి పశువులకు , నలభై నల్ల జాతి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ప్రజ్వాల్ సంస్థ గ్రామ కార్యకర్త తరాల తిరుపతి మాట్లాడుతూ మూగజీవాలు వాటి బాధలను చెప్పలేవని ముందుగానే రైతులు నివారణకు టీకాలు వేయించి మూగజీవాలను రక్షించు కోవాలని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రవి రమేష్ బాబు, సదానందం, నవయుగ సొసైటి డైరెక్టర్ అల్లే రాజీరు, శ్రీపతి రామకోటి, చెల్పూరి రామచంద్ర , కుమారస్వామి , అనిల్, గోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం

## – నరహరిశెట్టి రామకృష్ణ ఆరోపణ

**వేద న్యూస్,శాయంపేట:**




శాయంపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శాసనసభ ఎన్నికల సమయంలో మోసపూరితమైన ఆరు గ్యారంటీలు ఎన్నికల హామీలను రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి దాదాపుగా రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్క గ్యారెంటీని కూడా అమలు చేయకపోవడంతో దానికి నిరసనగా శాయంపేట మండల కేంద్రంలోని చౌరస్తా నుండి తాసిల్దార్ కార్యాలయానికి బిజెపి శ్రేణులతో ర్యాలీగా వెళ్లి మండల తాసిల్దార్ కి మెమోరండం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి ఇరువురు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలతోపాటు నాలుగు వందల ఇరవై దొంగ హామీలను నెరవేరుస్తానని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు ఏ ఒక్క గ్యారెంటీని అమలు చేయలేదని వారు అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి మోసపూరితమైన హామీలను నమ్మి విశ్వాసంతో ఆ పార్టీకి ఓటు వేసిన ప్రజలను మోసగించిందని కాంగ్రెస్ పార్టీ రైతులను, మహిళలను, వృద్ధులను, నిరుద్యోగులను ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వర్గాల ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పరిపాలన ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజులలో ప్రజలు కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారని బిజెపి పార్టీ ప్రజల మద్దతుతో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రతి గ్రామం ప్రతి వాడలో ఎత్తి చూపెడతామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ జిల్లా నాయకులు బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, కోడెపాక సంజీవరావు, మాజీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి లడే శివ, ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, మామిడి విజయ్, మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి,భూత్ అధ్యక్షులు మునుకుంట్ల చంద్రమౌళి, పున్నం సాంబయ్య, కన్నెబోయిన రమేష్, మంద మధు, చెక్క దినేష్, ఎర్ర తిరుపతిరెడ్డి,గొలుసు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులైన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**వేదన్యూస్, గంగాధర :**



గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను వేధించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ తో ఫోన్‌లో మాట్లాడి, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను వేధించిన అటెండర్ యాకూబ్ పాషాను విధుల నుండి పూర్తిగా తొలగించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు విద్యాశాఖ అధికారులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ మెమోలు జారీ చేసి, వారిని ఇతర పాఠశాలలకు బదిలీ చేయనున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.

# రక్తదానం ప్రాణధానంతో సమానం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




## – ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్

రాజన్న సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై,రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేసి, రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ రక్తదానం ప్రాణధానంతో సమానమని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర.పోషిస్తుందన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్వచ్ఛం దంగా యువత ,ప్రజలు,ఆటో డ్రైవర్లు,పోలీస్ అధికారులు, సిబ్బంది సుమారు 460 మంది రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని,విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని, ముఖ్యంగా రక్తదానంపై వున్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయంలో,ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి,తల సేమియా వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్, నటేష్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు, డాక్టర్ సంధ్యారాణి,కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గుడ్లరవి,పెండ్యాల కేశవరెడ్డి, బుస్స.ఆంజనేయులు ,కరీంనగర్,సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



నవంబర్ 1న హైదరాబాద్ లో జరగనున్న చీఫ్ జస్టిస్ బీ.ఆర్ గవాయి పైన అక్టోబర్ 6న సుప్రీం కోర్టులో జరిగిన దాడికి నిరసనగా కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆరోజు హైదరాబాద్ కు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఈసం నారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు ఎస్సీ, ఎస్టీ యూనియన్ ఆఫీస్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థాయిలో ఎస్సీ, ఎస్టీ ఎదిగినా కుల వివక్ష ఇంకా కొనసాగుతుందని సుప్రీమ్ కోర్ట్ లో జరిగిన దాడిని రాజ్యాంగం పై జరిగిన దాడిగా చూడాలని, దళితులపై వివక్షను తిప్పికొట్టడానికి జరిగే ఈ పోరాటంలో ఎస్సీ, ఎస్టీలందరూ పాల్గొని దేశ వ్యాప్త నిరసన తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్ల శ్రీనివాస్,ఉపాధ్యక్షులు నమిండ్ల కిరణ్, పులిచెరు భాస్కర్,జాయింట్ సెక్రటరీ, భూక్యా రాజునాయక్, నరేష్ కోశాధికారి దామెర ఆనందం, ఎక్జిక్యూటివ్ మెంబర్స్, బొల్లెపాక ప్రభాకర్, జి సేవ్య, అయిత శ్రీకాంత్, ఎస్ మహర్షి, ఎం బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.మేఘనా రావు అధ్యక్షతన ఇంగ్లీషు విభాగ సెమినార్ హాల్లో ఏర్పాటు చేసిన డిపార్ట్ మెంటల్ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కేయూ విసి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నూతన పాఠ్యక్రమం, విద్యార్థుల ఆలోచన, సృజన, భాషా పరమైన నైపుణ్యాలు పెంచే దిశగా ఉండాలని కేయూ విసి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆంగ్ల విభాగం సెమినార్ హాల్లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం రూపొందించిన కొత్త పాఠ్యపుస్తకాన్ని ఆవిష్కరించారు. కృత్రిమమేధా యుగంలో సాఫ్ట్ స్కిల్స్ పాత్రను మరువకూడదని, ఆంగ్ల భాషా నైపుణ్యంతో జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించ వచ్చున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ నిరంతర ప్రాక్టీస్ ద్వార మాత్రమే ఆంగ్ల భాషపై భయం పోతుందని తెలిపారు. కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవన నైపుణ్యాలకే ప్రధాన భూమిక కలిగి ఉంటారన్నారు. డాక్టర్ సుకుమారి మాట్లాడుతూ లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ టెక్నిక్స్ ద్వార మాత్రమే ఆంగ్ల భాషపై పట్టు సాధించవచ్చని తెలిపారు. కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య ఎం. నవీన్ మాట్లాడుతూ విభాగాభివృద్ధికి సహకరించాలన్నారు. పాఠ్యప్రణాళిక అధ్యక్షురాలు పి. నిర్మల క్రెడిట్స్ గురుంచి, సిలబస్ లో వచ్చిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా అతిథులచే ఇంగ్లీష్ ఫర్ బ్రిలియన్స్ అనే పుస్తకం ఆవిష్కరించారు. ఇందులో లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ టెక్నిక్స్ పొందుపరిచినట్లు డాక్టర్ బి.దీపా జ్యోతి వెల్లడించారు.

# రక్తదానం చేసిన పోలీసులు

**వేద న్యూస్, శాయంపేట:**




పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం లో భాగంగా పరకాల డివిజన్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ లో పనిచేస్తున్న కానిస్టేబుల్స్ ,ఎస్సైలు, ఇన్స్పెక్టర్ లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సిబ్బందితోపాటు వాలంటరీలకు ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల విద్యార్థులతో పాటు సామాజిక స్పృహ ఉన్న వాళ్లంతా రక్తదాతలుగా మారడం అభినందనీయం అని పోలీసు వారు ఉన్నారు.

# అవసరమైతే పోక్సో కేసు నమోదు చేయండి..!

ఒకవేళ లైంగిక వేధింపుల విషయంలో హెచ్ఎం, ఇతర సిబ్బంది పాత్రపైనా విచారణ కొనసాగుతోందన్నారు. ఒకవేళ వారి పాత్ర కూడా ఉన్నట్లు తేలితే వారిపై పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడొద్దని ఇప్పటికే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ను కోరినట్లు తెలిపారు. కరీంనగర్ లో ఓ ప్రైవేట్ చైల్డ్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వద్ద మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. "నిన్న కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో జరిగిన ఘటన దారుణం. ఇది పోక్సో కేసు. పిల్లల జీవితాలతో ముడిపడి ఉన్న సమస్య. దీనిని ప్రచారం చేయడంవల్ల వాళ్ల జీవితాలు ప్రమాదంలో పడతాయి. దయచేసి మీడియా సంయమనంతో వ్యవహరించాలి"అని అభ్యర్థించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ గత 5 రోజుల నుండి లోతైన విచారణ జరిపించారు. నివేదిక తెప్పించారు. నిందితుడికి ఏ విధమైన ట్రీట్ మెంట్ ఇవ్వాలో ఆ ట్రీట్ మెంట్ ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో హెడ్మాస్టర్ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెను సస్పెండ్ చేశారు. వారి పాత్ర ఉంటే వాళ్లపైనా పోక్సో కేసు పెట్టేందుకు వెనుకాడవద్దని అధికారులకు చెప్పాను. పిల్లలకు భరోసా ఇవ్వడంతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళన పడకుండా ధైర్యం కల్పించాలని కోరిన. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి భరోసా కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు."అని వివరించారు.

# అటెండర్ యాకూబ్ పాషాను కఠినంగా శిక్షించాలి

## – ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా గంగాధర్ మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకున్న సంఘటనపై కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ టీచర్స్ బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మీడియాకు ఓ ప్రకటనను విడుదల చేశారు. కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో అటెండర్ గా పని చేస్తున్న యాకూబ్ పాషా బాలికల బాత్రూం లలో రహస్య కెమెరాలను అమర్చి వారి ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించినట్లు, వాటిని అడ్డుపెట్టుకొని బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పందిస్తూ "బాలికలపై ఇలాంటి దారుణలకు పాల్పడిన అటెండర్ యాకూబ్ పాషాను కఠినంగా శిక్షించాలని " ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు.

# నల్లబెల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శుభనివాస్



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి ఎంపీడీవోగా శుభనివాస్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన పసరగొండ రవి ఇక్కడే ఎంపీవోగా కొనసాగనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రూప్స్ లలో ఎంపికైన శుభనివాస్ కు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో శుభనివాస్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించాలని సూచించారు. ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. మండల స్థాయి అధికారులు అందరం కలిసి సమన్వయంతో పని చేసి జిల్లాలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుదామని తెలియజేశారు.

# రక్తదానం..ప్రాణదానమే

## - అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నర్సంపేటలో రక్తదాన శిబిరం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని నర్సంపేట డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలోసోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నల్లబెల్లి ఎస్ఐ వి. గోవర్ధన్ ఆధ్వర్యంలో టీ డబ్ల్యూ జె ఎఫ్ వరంగల్ ఉపాధ్యక్షులు,నల్లబెల్లి కలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, కొమ్మురాజు, నల్లబెల్లి మండల ఆటో యూనియన్ అధ్యక్షులు రెడ్డి ప్రశాంత్, యూనియన్ సభ్యులు విద్యార్థులు, దాదాపు 20 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వి. గోవర్ధన్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి కాపాడడానికి ఈ రక్త ఎంతో ఉపయోగకరం అని తెలిపారు. రక్తహీనత వల్ల ప్రమాదాల వల్ల గర్భిణీ స్త్రీలకు తగిన రక్తం లేక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంది కాబట్టి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. ఈ సందర్భంగా కలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మురాజు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం సందర్భంగా రక్తదానం ఇవ్వడం తనకి ఎంతో సంతోషంగా ఉందన్నారు. మోటార్ బైకులపై ప్రయాణించేటప్పుడు పరిమిత వేగంతో ప్రయాణించాలంటు అతివేగంతో మోటార్ సైకిల్ నడిపి కన్నవారికి కన్నీటి వేదను మిగిల్చవద్దన్నారు. అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ సాయి రమణ, ఎస్సై వి. గోవర్ధన్, హెూంగార్డ్ రమేష్, నల్లబెల్లి మండలం కలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మురాజు, నల్లబెల్లి మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు రెడ్డి ప్రశాంత్, యూనియన్ సభ్యులు పల్లికొండ రవి, శ్రీను, సారంగం, శ్రీనివాస్ శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 'మొంథా' తుపాను అలజడి



## – కాకినాడ పోర్టులో 10వ నంబరు అత్యంత ప్రమాద హెచ్చరిక జారీ!

**వేద న్యూస్, కాకినాడ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను తీవ్రరూపం దాల్చి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు అత్యంత వేగంగా దూసుకొస్తోంది. ఈ నేపథ్యంలో, తుపాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి కాకినాడ పోర్టులో అత్యంత తీవ్రమైన హెచ్చరిక అయిన 10వ నంబరు ప్రమాద సిగ్నల్‌ను అధికారులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ, తుపాను కారణంగా ప్రజలకు ఏర్పడే ఎలాంటి ఇబ్బందిలోనైనా సహాయం అందించేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తుపాను ప్రస్తుతం కాకినాడకు దాదాపు 270 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది, దీని కారణంగా తీర ప్రాంతాల్లో భారీ అలజడి నెలకొంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు స్పందన దళం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. మొత్తం 25 బృందాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి, సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తుగానే మోహరించారు. ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ నరేందర్ సింగ్ బుందేలా ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, తుపానును ఎదుర్కొనేందుకు తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని, నష్టాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సెక్రటరీ స్వయంగా సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈ ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. తీరం దాటిన తర్వాత తలెత్తే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారని ఆయన వివరించారు.

బంగాళాఖాతంలో తుపాను తీవ్రత పెరుగుతుండటంతో విశాఖపట్నంలోని తుపాను హెచ్చరికల కేంద్రం తీర ప్రాంతాలకు హెచ్చరికలను పెంచింది. కాకినాడలో 10వ నంబరు సిగ్నల్ ఎగురవేయగా, విశాఖపట్నం, గంగవరం, కళింగపట్నం, భీమునిపట్నం పోర్టులలోనూ 9వ నంబరు ప్రమాద హెచ్చరికలను కొనసాగిస్తున్నారు. ఈ తుపాను ప్రభావం పొరుగు రాష్ట్రమైన తమిళనాడుపైనా ఉండవచ్చన్న అంచనాలతో అక్కడి ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. చెన్నైలోని రిపన్ బిల్డింగ్‌లో ఉన్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ అధికారులతో సమీక్ష నిర్వహించి, సన్నద్ధతను పరిశీలించారు.



# ఉదండాపూర్ నిర్వాసితులకు అండగా ఉంటాం

చేపడుతున్న చర్యలు చూస్తే, కేవలం మాటలకే పరిమితమైన 'పేపర్ టైగర్' అని రుజువవుతోందని ఆమె విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలోనూ, ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంలోనూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆమె తప్పుబట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ఎంత పట్టుదలతో చేసిందో గుర్తు చేశారు. ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేసిన రైతులకు తక్షణ న్యాయం జరగాలని కవిత స్పష్టం చేశారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు 25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, 2021 నాటి కటాఫ్ రేటు ప్రకారం కాకుండా, రైతులకు చెల్లింపు చేసిన రోజున ఉన్న రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని, తద్వారా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి న్యాయం జరుగుతుందని ఆమె సూచించారు. పరిహార పంపిణీలో ఏ ఒక్క లబ్ధిదారుడికి కూడా అన్యాయం జరగరాదని కవిత కోరారు. ప్రాజెక్టు ప్రకటించిన సమయానికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క లబ్ధిదారుడిని పరిహారం జాబితాలో చేర్చాలని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే, తెలంగాణ జాగృతి సంస్థ నిర్వాసిత ప్రజలకు స్థిరంగా అండగా నిలుస్తుందని, న్యాయం జరిగే వరకు పోరాడుతుందని ఆమె ప్రకటించారు.

# 'హైడ్రా' చేతుల్లో బమ్మృక్నుద్దౌలా చెరువు పునరుద్ధరణ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

పాతబస్తీలోని చారిత్రక బమ్మృక్నుద్దౌలా చెరువు సర్వాంగ సుందరంగా పునరుద్ధరణ పనులను పూర్తి చేసుకుంటోంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో హైడ్రా సంస్థ వేగంగా పనులు చేపడుతోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం చెరువు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది ఆగస్టు నెలలో చెరువు ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. పూర్వం 18 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు ఆక్రమణల కారణంగా కేవలం 4.12 ఎకరాలకు పరిమితమైపోగా, ఆక్రమణలను తొలగించి ఇప్పుడు చెరువును మళ్లీ 18 ఎకరాల మేర విస్తరిస్తున్నారు. వరద కట్టడితో పాటు, భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా చెరువును తీర్చిదిద్దుతున్నామని, వరద నీరు చేరేలా నిర్మించిన ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్లను కమిషనర్ పరిశీలించారు. బమ్మృక్నుద్దౌలా చెరువు చుట్టూ బండ్ నిర్మించి, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే ఏరియాలు, వృద్ధులు సేద దీరే విధంగా సీటింగ్‌తో కూడిన పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చెరువు చుట్టూ రహదారులు నిర్మించడంతో పాటు, గ్రీనరీని పెంచే విధంగా మొక్కలు నాటి పచ్చిక బైళ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పునరుద్ధరణలో నాటి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షిస్తున్నారు. నిజాంల కాలంలో రాతితో నిర్మించిన బండ్‌ను చెక్కు చెదరకండా కాపాడుతూ, మరింత పటిష్టం చేస్తున్నారు. చెరువులో మట్టిలో కలిసిపోయిన నాటి రాళ్లను బయటకు తీసి భద్రపరుస్తున్నారు. స్థానిక నివాసితులు అక్కడకు వచ్చి సేదదీరేవిధంగా తీర్చిదిద్దడంతో పాటు, సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు. ఈ చారిత్రక చెరువు చరిత్ర ఎంతో ఘనమైంది. 1770లో హైదరాబాదు మూడవ నిజాం సికందర్ జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్నుఉద్‌దౌలా ఈ చెరువును నిర్మించారు. చారిత్రక ఆనవాళ్ల ప్రకారం, వంద ఎకరాలకు పైగా విస్తరించి ఉండే ఈ చెరువుకు రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వరద నీరు చేరేది. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్మృక్నుద్దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా, ఈ చెరువు చుట్టూ సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని, ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు (అత్తరు) తయారీకి వినియోగించేవారని, ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీటిని తీసుకెళ్లేవారనే కథనాలు ఉన్నాయి. అంతేకాక, వనమూలికల చెట్ల కొమ్మలు వేసి, దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని నిజాంలు తాగేందుకు వినియోగించేవారని, దానికి ఔషధ గుణాలు ఉండేవని చెబుతున్నారు. ఇన్నేళ్ల తర్వాత ఈ చారిత్రక చెరువు పునరుద్ధరణకు నోచుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వేద న్యూస్
బుధవారం అక్టోబర్ 29, 2025

# ప్రభుత్వ సిటీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం ప్రకటన



**వేద న్యూస్, హైదరాబాద్ :**

2025-26 సంవత్సరానికిగాను ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు అర్హతల ధ్రువీకరణ పత్రాలతో తమ దరఖాస్తులతో అక్టోబర్ 31వ తేదీ సిటీ కళాశాలలో అకడమిక్ కో ఆర్డినేటర్ డా.వాసుదేవ రెడ్డిని కలవాలని పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య కె.పద్మావతి తెలిపారు. ఇంటర్వ్యూలు అదే రోజు ఉంటాయని తెలియజేశారు. ఇంగ్లీషు, కామర్స్, బయో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, మేథమేటిక్స్, ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ లో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని, పిహెచ్ డి, ఎం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతోపాటు బోధనానుభావం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఇతర వివరాల కోసం డా.వాసుదేవ రెడ్డి (9440136451)ని సంప్రదించవలసిందిగా ప్రకటనలో తెలియజేశారు.

# మాదక ద్రవ్యాల పై అవగాహన




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కేయూ ఇంజనీరింగ్ కాలేజీ కో ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రమణ అధ్యక్షతన ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో సంక్షేమశాఖ, మాదక ద్రవ్య నియంత్రణ విభాగం, కె.యూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయక్త నిర్వహణలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ మాదక ద్రవ్య రహిత ప్రాంగణమని వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు, వాటి పరిణామాలను వివరించారు. కేయూ పాలక మండల్ సభ్యులు డా. అనితా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యకరమైన, భాధ్యతాయుతమైన జీవన శైలిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి, మాదక ద్రవ్య నియంత్రణ విభాగం డీఎస్పీ రమేశ్ కుమార్, ఎస్ఐ రవీందర్, ఎన్జీఓ అధికారి డా. ఆచార్య మాదక ద్రవ్య వ్యసనానికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు, వాటికి సంబంధించిన చట్టపరమైన పరిణామాలను వివరించారు. కేయూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. రమణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ. నారాయణ, ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంలో అందరూ కలిసి చేసిన కృషిని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో డా. ఆసిం ఇక్బాల్, డా.సి హెచ్ రాధిక, కె.సుమలత, డా.వి.మహేందర్, సూపరింటెండెంట్ ప్రభాకర్, డా.విజయ్, కల్పనాదేవి, కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. డి. శిలాజా, ఎం. సౌజన్య, జిల్లా అధికారులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు చురుకుగా పాల్గొని, మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే తమ ప్రతిజ్ఞను పునరుద్ఘాటించారు.

# హరీశ్‌రావు తండ్రి మృతిపట్ల సీఎం రేవంత్ సంతాపం

**వేద న్యూస్, సిద్దిపేట:**



మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. హరీష్ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# హరీశ్ రావు తండ్రికి మంత్రి పొన్నం నివాళులు



**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హరీశ్ రావు నివాసమైన క్రిన్స్ విల్లాస్‌కు వెళ్లి, సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన హరీష్ రావును ప్రత్యేకంగా పరామర్శించారు. ఈ కష్ట సమయంలో హరీశ్ రావుకు మరియు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని మంత్రి ఆకాంక్షించారు.

# అధికారులు అలెర్ట్ గా ఉండాలి

## – కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,అదనపు కలెక్టర్ జి సంధ్య రాణి ప్రభుత్వ ఆదేశాల మేరకు వాతావరణ శాఖ హెచ్చరికల ననుసరించి లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో పాటు జిల్లా ప్రత్యేక అధికారులు ఎన్ డి ఆర్ ఎఫ్ అధికారుల తో ముందస్తు జాగ్రత్త చర్యల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా ఖరీఫ్ సీజన్ లో తుఫాన్ ప్రభావాన్ని బట్టి రెండు రోజులు రైతులు వరి కోతలు చేపట్టవదని, ఇప్పటికే వరి కోతలు చేపట్టిన రైతులు వరి తడవకుండా తర్పాలిన్ తో కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గ్రామపంచాయతీ పరిధుల్లో పంచాయతీ సెక్రటరీలు గ్రామాలలో టాం టాం వేయించాలని, అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల లో విస్తృతంగా పర్యటించి రైతులకు ముఖ్య సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. జిల్లాలోని రైతుల పంట విస్తీర్ణం, ఆ విస్తీర్ణంలో ఏ పంటలు,ఏ మేరకు వేశారో కూడా మండల్ అగ్రికల్చర్ అధికారుల నివేదికలు తయారు చేయాలన్నారు. తద్వారా వాటి ఆధారంగా పిపిసి సెంటర్లకి వరి ధాన్యం, జొన్న,మొక్కజొన్న, కాటన్ ఏ మేరకు, ఏ ఏ పిపి సి సెంటర్లకు రావచ్చు అనేది ముందస్తు ప్రణాళికలు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నివేదికలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు రైతులకు వరి కోతల చేపట్టుటల్లో మెలకువలు తెలియజేయాలని, అదేవిధంగా పిపిసి సెంటర్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. పిపిసి సెంటర్ల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. ఏపిపి సెంటర్లకు ఎక్కువ మొత్తం ధాన్యం కొనుగోలు కు ఏ ఏ మండలాల నుండి రావచ్చు, ముందస్తు వరి కోతలు వచ్చే మండలాలకు గుర్తించి అన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కువ ధాన్యం వచ్చే పి పి సి సెంటర్లను గుర్తించి అన్ని ఏర్పాటు చేయాలన్నారు. పిపిసి సెంటర్లు రోడ్లకు ఇరువైపులా ఉండకూడదని రైతులకు రవాణా సౌకర్యం ఉండే ప్రాంతాలలో పి పి సి సెంటర్లు ఏర్పాటుకు అనుకూలమైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కి 3.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా తో ప్రణాళికల కు అనుకూలంగా పిపిసి సెంటర్లను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం పిపి సెంటర్లు 257 కాగా ఐకెపి సెంటర్లు 105 పిఎసిఎస్ 142 ఏపీ సీఏల్ 9, మెప్మా ఒకటి గా ఉన్నాయని ఈ సెంటర్లలో మౌలిక వసతుల కల్పన తోపాటు ప్యాడి క్లీనర్స్, బాడీ మాయిచ్చర్ మిషన్స్ , టార్పాలిన్స్ గన్ని బ్యాగ్స్ అందుబాటులో ఉండేలా చూడాలని, పిపి సెంటర్లలో ముందస్తు వైద్య సౌకర్యాల నిమిత్తం ఆశ వర్కర్ తో పాటు ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

డిసిఎస్ఓ కార్యాలయంలో హెల్ప్ డేస్ ఏర్పాటు చేసి హెల్ప్ లైన్ నెంబర్ 7995050785 ద్వారా రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం అలర్ట్‌గా ఉందని తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ఎలాంటి సంఘటన జరగకుండా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఆర్టీసీ మరియు స్కూల్ పిల్లల విషయంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియపరుస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ మండలాల తహసిల్దార్ల, మరియు మండల అగ్రికల్చర్ అధికారుల, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వారికి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని,రైతులకు ఎలాంటి పంట నష్టం,ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అనురాధ, డిసిఓ నీరజ, డిసిఎస్ ఓ కిష్టయ్య, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీఎంవో సురేఖ, డిఎం మార్కెడ్ రంజిత్, జిఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి,డి యం అండ్ హెచ్ ఓ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

**వేద న్యూస్,వరంగల్ టౌన్:**



పన్ను వసూళ్లలో వేగం పెంచాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించి పన్ను వసూళ్ల పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని పెండింగ్ పన్నులను సమయానుకూలంగా వసూలు చేయడం ద్వారా బల్దియా ఆర్థిక స్థితి బలపడుతుందని పేర్కొన్నారు. ప్రతి వార్డు పరిధిలో పన్ను చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించి, 100 శాతం వసూళ్లను సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ఆస్తి పన్నుతో పాటు నీటి , ఇతర పన్నులను సేకరించాలని, అందుకు ఆర్ ఓ లు, ఆర్ ఐ లు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. నవంబర్ చివరి నాటికి కనీసం 45 శాతం పన్నులు వసూలు.చేయాలని అన్నారు. కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో పారదర్శకత, వేగం మరియు సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పన్నుల లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్న సిబ్బందిపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ లు రవీందర్ ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్ ఓ లు శేహజాది బేగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

**వేద న్యూస్, తిరుమల :**



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టీటీడీ ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, ఈవో శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలిసి ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, నవంబరు 17 నుండి 25వ తేదీ వరకు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు చెప్పారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నవంబరు 11వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుందన్నారు. నవంబరు 16వ తేదీన లక్షకుంకుమార్చన, అంకురార్పణ నిర్వహిస్తారని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా నవంబరు 17న ధ్వజారోహణం, 21న గజ వాహనం, 22న స్వర్ణరథం, గరుడ వాహనం, 24న రథోత్సవం, 25న పంచమితీర్థం, 26న పుష్పయాగం నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో శ్రీ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073